క్లుప్తంగా

కల్యాణం .. కమనీయం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై ఉత్సవ మూర్తులను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

శారదాపీఠాన్ని సందర్శించిన తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్



పీఠాధిపతుల ఆశీస్సులు తీసుకుంటున్న వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

సింహాచలం: విశాఖ శ్రీ శారదాపీఠాన్ని శనివారం తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు సందర్శించారు. పీఠం అధిష్టాన దైవం రాజశ్యామల అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతిలను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. హరియాణ రాష్ట్రం కురుక్షేత్రలో గతనెలలో జరిగిన లక్ష చండీ మహా యజ్ఞంకి హాజరుకాకపోవడంతో పీఠాధిపతుల ఆశీస్సులు తీసుకునేందుకు వచ్చినట్టు కృష్ణమోహన్‌రావు తెలిపారు. ఆయన వెంట బీసీ సంఘాల నాయకులు పితాని ప్రసాద్, పెదిరెడ్ల రాజశేఖర్, పోలు మహంతి ఉమామహేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ట్రాలీలకు వీల్స్ ఏర్పాటు

సింహాచలం: సింహగిరిపై అన్నప్రసాద భవనంలో ఆహార పదార్థాలు తరలించే ట్రాలీలకు దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు కె.వి. నాగేశ్వరరావు ఆర్థిక సాయంతో నూతన చక్రాలు(ఫైబర్‌వీల్స్) ఏర్పాటు చేసే పనులు శనివారం ప్రారంభించారు. నూతన చక్రాలను వేసేందుకు నాగేశ్వరరావు 24,600 వెచ్చించి 48 ఫైబర్ వీల్స్ అందజేశారు.

14న సత్తెమ్మతల్లి వార్షిక జాతర



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవి వరం గ్రామ పొలిమేర దేవత సత్తెమ్మతల్లి వా ర్షిక జాతరను ఈనెల 14న ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు పి.వెంకటరావుశనివారం తెలిపారు. భక్తులకు ఉచిత ప్రసాద వితరణ, మధ్యాహ్నం అన్నసమారాధన చేస్తున్నట్టు చెప్పారు. వార్షిక జాతర నేపథ్యంలో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అభివృద్ధి కమిటీ సభ్యులు గంట్ల కనకరాజు, బలిరెడ్డి శ్రీనివాస్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు భువనేశ్వరీదేవి అధివాసం



దాబాగార్డెన్స్: ఓం భువనేశ్వరి సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సబ్బవరం మండలం చెల్లయ్యపేటలో వెలసిన భువనేశ్వరీదేవికి గాదిచెట్టు పత్రితో అధివాస మహోత్సవం నిర్వహించనున్నట్టు ట్రస్ట్ నిర్వాహకుడు మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పంచమి, స్వాతి నక్షత్రం సందర్భంగా ఈ ఉత్సవం జరపనున్నామని, అమ్మవారికి మంగళ స్నానం చేసి దివ్య పంచామృతాలు, కర్పూరాది సుగంధి గంధాదులతో అలంకరించనున్నట్టు చెప్పారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

పరిశీలించిన అధికారులు	
పెందుర్తి మండలంలో మొత్తం ఓటర్లు :	9811
పురుషులు :	5461
మహిళలు :	4350



శాంతినగర్ ఎంపీపీ స్కూల్లో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్, జెడ్సీ



పరవాడ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఈఆర్వో ప్రకాశరావు, ఎంపీడీవో హేమసుందర్రావు



సబ్బవరం పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ రంగనాథం



ఉక్కునగరం పోలింగ్ కేంద్రం వద్ద బందో బస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ ఈశ్వరరావు

సింహాచలం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి పెందుర్తి నియోజకవర్గంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టభద్రులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే విధంగా వసతులు కల్పిస్తున్నారు. పెందుర్తి తహసీల్దార్ ఆనంద్ కుమార్, జీవీఎంసీ జోన్-8 జెడ్సీ మల్లయ్యనాయుడు శనివారం ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు... అప్పారావు,సీఐ, పెందుర్తి

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. ఒక్కొక్క పోలింగ్ బూత్ వద్ద ఐదుగురు చొప్పున బందోబస్తు నిర్వహిస్తారు. అలాగే 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో వాహనాలకు ప్రవేశం లేదు. కేంద్రానికి వంద మీటర్ల దూరం నుంచి కేవలం ఓటర్లనే అమమతిస్తాం. మొబైల్ వాహనాల ద్వారా పోలీసులు గస్తీ నిరంతరం ఉంటుంది.

పరవాడ మండలంలో..

పరవాడ: ఈ నెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కోసం మండలంలో ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఎన్నికల నిర్వహణ కోసం రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో పరవాడ బాలికల పాఠశాల, ఉక్కునగరం బాల విహార్ పాఠశాలల్లో రెండేసి పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. పరవాడ మండల పరిధిలో 2,102 ఓటర్లు ఉండగా వారిలో 1,242 మంది పురుషులు, 860 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకొనేందుకు వీలుగా పరవాడ బాలికల పాఠశాలలో 201, 201ఎ పోలింగ్ బూత్‌లు, ఉక్కునగరం బాల విహార్ పాఠశాలలో 202, 203 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. పరవాడ, ఉక్కునగరం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు, ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వి.ప్రకాశరావు, ఎంపీడీవో వి.హేమసుందరావులు శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు చెప్పారు. పరవాడ, ఉక్కునగరం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శనివారం సందర్శించారు. మండలంలో మద్యం షాపులను శనివారం సాయంత్రం 4 గంటల నుంచి సోమవారం సాయంత్రం 6 గంటల వరకు మూయించామని చెప్పారు.

ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు చర్యలు

సబ్బవరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని సీఐ రంగనాథం తెలిపారు.ఎన్నికల బందోబస్తు ఏర్పాట్లలో భాగంగా సబ్బవరంలోని పోలింగ్ కేంద్రాన్ని ఆయన సిబ్బందితో కలిసి శనివారం పరిశీలించారు. విధుల్లో 42 మంది పోలీస్ సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. వీరిలో ఒక సీఐతో పాటు ఇద్దరు ఎస్ఐలు,10 మంది హెచ్‌సీలు,29 మంది పీసీలు ఉన్నారన్నారు. ఆయన వెంట ఎస్ఐ ఎల్ సురేష్, అల్లు వెంకటేశ్వరరావు ఉన్నారు.

1899 మంది ఓటర్లు

మండంలో 1899 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 1139 మంది, మహిళా ఓటర్లు 759, ట్రాన్స్ జెండర్ ఒకరు ఉన్నారు. వీరంతా సబ్బవరంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు వేయనున్నారు. ఓటర్లు ప్రాతిపదికన పోలింగ్ కేంద్రంలో 200, 200ఎ రెండు పోలింగ్ బూతులు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రంలో అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్టు తహసీల్దార్ బి. సత్యనారాయణ తెలిపారు.

పోలింగ్ బూత్	పాఠశాల	పురుషులు	మహిళలు	మొత్తం
219	ప్రభుత్వ హైస్కూల్, పెందుర్తి	740	590	1330
220	ప్రభుత్వ హైస్కూల్, పెందుర్తి	682	586	1268
221	ప్రభుత్వ హైస్కూల్, పెందుర్తి	709	496	1205
222	జెడ్పీ హైస్కూల్,శాంతినగర్, చినముషిడివాడ	741	558	1299
223	ఎంపీపీ స్కూల్, శాంతినగర్ చినముషిడివాడ	567	398	965
224	ఎంపీపీ స్కూల్, పురుషోత్తపురం	461	366	827
279/279ఎ	జెడ్పీ హైస్కూల్, వేపగుంట	896	770	1666
280	జెడ్పీ హెస్కూల్, వేపగుంట	665	586	1251

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

దాబాగార్డెన్స్: ఉగాది విశిష్ట ప్రతిభారత్న-2023 పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సర్వేజనా సుఖినో భవంతు సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పల్లెలు, పట్టణాల్లో ఉన్న కవులు, కళాకారులు, రచయితలు, విద్యావంతులు, ఉపాధ్యాయులు, మేధావులు, వైద్యులు, సమాజ సేవకులు, ఆధ్యాత్మిక, యోగా గురువులు, కార్మికులు, కర్షకులు, క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ఉగాది విశిష్ట ప్రతిభా రత్న పురస్కారంతో ఈ నెల 26న హైదరాబాద్‌లో ఘనంగా సత్కరించనున్నట్టు పేర్కొన్నారు. ఆయా రంగాల్లో సేవలందిస్తున్న వారు తమ ప్రతిభను గురించి తెలియజేసే సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్స్.. గతంలో పొందిన పురస్కారాల సర్టిఫికెట్లు, ఫొటోలు జిరాక్స్ కాపీలతో పాటు 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలు దరఖాస్తుకు జత చేసి ఈ నెల 20వ తేదీలోగా సర్వేజనా సుఖినో భవంతు, 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం పోస్టు, తిరుమలగిరి, సికింద్రాబాద్-15 చిరునామాకు పంపాలని సూచించారు. మరిన్ని వివరాలకు 96523 47207 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

గురుకులంలో ప్రవేశాలు



సబ్బవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం

సబ్బవరం: సబ్బవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 2023-24 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 24వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తులను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో నేరుగా ఇవ్వవచ్చునని.. లేదా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల ముఖాముఖి నేడు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆడారి కిషోర్‌కుమార్

సీతంపేట: ఈ నెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఎమ్మెల్సీ అభ్యర్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఉత్తరాంధ్ర విద్యావంతుల వేదిక కన్వీనర్ ఆడారి కిషోర్‌కుమార్ తెలిపారు. పబ్లిక్ లైబ్రరీలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సహాయత వెల్ఫేర్ సొసైటీతో కలిసి మొదటి సారిగా ఎన్నికల బరిలో పోటీపడుతున్న అభ్యర్థులతో ఓపెన్ డిబేట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధాన రాజకీయ పార్టీలు మద్దతు ఇస్తున్న అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్న సుమారు 38 మంది పాల్గొంటారని వెల్లడించారు. వారంతా తమ మ్యానిఫెస్టోను వివరిస్తూ ఈ చర్చా వేదికపై నుంచి కార్యాచరణ వివరిస్తారన్నారు. ముందుగా కార్యక్రమ కరపత్రాలు ఆవిష్కరించారు. సమావేశంలో జ్ఞానానంద, వెంకటేష్, శ్రీధర్, వంశీ, అసిత పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ జవానుకు కన్నీటి వీడ్కోలు



తండ్రి అంతిమయాత్ర నిర్వహిస్తున్న పెద్ద కుమార్తె శ్వేత

ఉయ్యూరు: సీఐఎస్ఎఫ్ జవానుకు కన్నీటి వీడ్కోలు పలికారు. ఉయ్యూరుకు చెందిన చింతా రమేష్‌బాబు (53) విశాఖపట్నం వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో సీఐఎస్ఎఫ్ జవానుగా పనిచేస్తున్నారు. గుండెపోటుతో గురువారం కన్నుమూశారు. భౌతికకాయాన్ని శుక్రవారం రాత్రి స్వగ్రామమైన ఉయ్యూరుకు తరలించారు. శనివారం రమేష్‌బాబు భౌతిక కాయానికి అధికార లాంఛనాలతో సీఐఎస్ఎఫ్ జవానులు అంత్యక్రియలు జరిపించారు. జవాను రమేష్ బాబుకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె శ్వేత, చిన్న కుమార్తె కీర్తి తండ్రికి అన్నీ తామై అంత్యక్రియలు నిర్వహించి కన్నీటి పర్యంతం అయ్యారు. హిందూ శ్మశానవాటికలో పెద్ద కుమార్తె శ్వేత తండ్రి భౌతిక కాయానికి తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది.

ఉక్కు ప్రైవేటీకరణను నిలిపివేయాలి



758వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న కాంట్రాక్ట్ కార్మికులు

కూర్మన్నపాలెం : ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ కోసం నిరంతరం కార్మికులు చేస్తున్న పోరాటానికి కేంద్ర ప్రభుత్వం సమాధానమివ్వాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 758వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన ఎం.ఎస్.ఎస్-2 విభాగానికి చెందిన కార్మికులు పాల్గొన్నారు. కార్మికులు చేస్తున్న పోరాటానికి విలువనిచ్చి కేంద్ర ప్రభుత్వం ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

సింహాచలం: జీవీఎంసీ 96వ వార్డు పరిధి పెందుర్తి విక్టరీ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో క్రిస్టియన్ పెంతు మినిస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్. డానియల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పెందుర్తి బీసీ కాలనీ, పులగానిపాలెం, నల్ల క్వారీ పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలకు డాక్టర్ అక్కయ్య స్టార్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి చెందిన వైద్యులు డాక్టర్ సీహెచ్. ఇందిరాఎవన్‌జలిన్, డాక్టర్ రమాదేవి, డాక్టర్ నారాయణ, వైద్య సేవలు అందించారు. ఉచితంగా మందులు అందజేశారు. పెంతు మినిస్టర్స్ అసోసియేషన్ డైరెక్టర్స్ సీహెచ్.మేరీరత్నం, సీహెచ్. విక్టరీబాబు, ఎం.ఆనంద్, ఆదిలక్ష్మి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

లలితా పీఠంలో సంకటహర చతుర్థి

సీతంపేట: సంకటహర చతుర్థి సందర్భంగా లలితానగర్ లలితా పీఠంలో శనివారం వినాయకుడికి ప్రత్యేక పూజలు, లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. గణపతికి ప్రీతిపాత్రమైన తిథుల్లో చతుర్థి ఒకటని, మనుషులను కష్టాల నుంచి గట్టెక్కించే సంకటహర చతుర్థి వ్రతం ఎంతో విశిష్టమైనదని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ అన్నారు. పీఠం అర్చకుల మంత్రోచ్చారణల నడుమ దూప దీప నైవేద్యం, గణేశ స్తోత్రం, వ్రత కథ చదివారు. అనంతరం పీఠం దర్బారు హాల్లో శాస్త్రోక్తంగా గణపతి హోమం నిర్వహించారు. ఈ హోమం వల్ల కార్యసిద్ధి, ఆరోగ్యం, విజయం లభిస్తాయని అర్చకులు తెలిపారు. పంచమి సందర్భంగా ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు పీఠంలో వారాహి హోమం జరుగుతుందని కృష్ణసేన్ చెప్పారు.

● పల్లకీలో జంట.. కనుల పంట



ఎంవీపీకాలనీ: ఓ నవ జంట శనివారం పల్లకీలో ఊరేగుతూ కనువిందు చేసింది. సాధారణంగా పల్లెటూరులో ఇటువంటి కమనీయ దృశ్యాలు కనిపిస్తాయి. నగరంలోని అప్పుఘర్‌లో బంధుమిత్రుల పరివారంతో పల్లకీలో ఊరేగుతున్న ఈ నవ జంటను చూసేందుకు వాహనచోదకులు, స్థానికులు ఉత్సాహం చూపించారు.

వైభవంగా శ్రీనృసింహ హోమం



ప్రధాన కలశంతో ప్రదక్షిణ చేస్తున్న పురోహిత్ అలంకారి

సింహాచలం: సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో శనివారం నృసింహ హోమం ఘనంగా జరిగింది. వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతీ స్వాతి నక్షత్రం రోజున లోక కల్యాణార్థం నృసింహ హోమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా శనివారం స్వాతి నక్షత్రం కావడంతో నృసింహ హోమం విశేషంగా నిర్వహించారు. తొలుత చక్రపెరుమాళ్లను ఆలయం నుంచి ఊరేగింపుగా కల్యాణమండపం వద్దకు తీసుకొచ్చి హోమగుండం వద్ద అధిష్టంపజేశారు. యాగంలో పాల్గొన్న ఉభయదాతలకు కంకణధారణ చేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం , కలశారాధన, అగ్నికార్యం చేశారు. అనంతరం నృసింహ హోమం విశేషంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, కుంభప్రోక్షణ విశేషంగా నిర్వహించారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని పురోహిత్ అలంకరి కరి సీతారామాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. తదుపరి ఆ జలాలను భక్తులపై చల్లారు. ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ముగిసిన ప్రచారం



95వ వార్డులో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు



వాడచీపురుపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సింహాచలం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార పర్వం శనివారం సాయంత్రంతో ముగిసింది. ఆఖరి రోజు బరిలో ఉన్న అభ్యర్థుల తరఫున మద్దతు దారులు ప్రచారం చేశారు. నమూనా బ్యాలెట్ పత్రాలు అందజేసి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు.

● ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు కోరారు. వేపగుంట రామాలయం వీధి, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, రజక కాలనీలో శనివారం కార్పొరేటర్ ముమ్మన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. సీహెచ్. జల్లుబాబు, అంగటి సూరిబాబు, హరి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్‌కు పట్టం కట్టండి

పరవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మూడో సీరియల్‌లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు కోరారు. సుధాకర్‌కు మద్దతుగా వాడచీపురుపల్లి శివారు ఊటగెడ్డపాలెం, దలాయిపాలెం, ఇస్సన్నపేట గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, లంకెలపాలెం పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

● దేశపాత్రునిపాలెంలో 79 వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, వార్డు సీనియర్ నాయకుడు కాసు అంజిరెడ్డి ఆధ్వర్యంలో సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

సింహాచలం: కుటుంబ గొడవలతో మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనకు సంబంధించి పెందుర్తి పోలీసులు తెలిపిన వివరాలు.... పెందుర్తి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి చెందిన బాడంగి రాజు(24) బైక్ ట్యాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గతేడాది ఏప్రిల్‌లో నగరంలోని డాబాగార్డెన్స్‌కు చెందిన ధనలక్ష్మితో వివాహం జరిగింది. తల్లి, భార్యకు తరచూ గొడవలు జరుగుతుండడంతో వారికి సర్దిచెప్పలేక పోయాడు. ఈ తరుణంలో భార్యతో కలిసి వేరే కాపురం పెట్టాడు. కాగా భార్య ధనలక్ష్మి డెలివరీ కోసం రెండునెలల కిందట పుట్టింటికి వెళ్లింది. అత్త తనను తరచూ వేధింపులకు గురిచేస్తోందని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. అప్పటి నుంచి రాజు పనిమానేసి మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం రాత్రి పడుకున్న రాజు శనివారం మధ్యాహ్నం 12 గంటలవుతున్నా లేవకపోవడంతో తల్లి అతని ఇంటికి వెళ్లింది. ఎంత పిలిచా పలకకపోవడంతో స్థానికులు వచ్చి తలుపులు బద్దలు కొట్టి చూడగా ఉరివేసుకుని రాజు ఉన్నాడు. వెంటనే పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న లా అండ్ ఆర్డర్ ఎస్ఐ సురేష్ పరిశీలనచేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు.

ఏప్రిల్ 9న హెచ్ఆర్‌సీ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న మంత్రి శ్యాంప్రసాద్

దాబాగార్డెన్స్: ఏప్రిల్ 9న డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మానవ హక్కుల కౌన్సిల్(హెచ్ఆర్‌సీ) సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని కౌన్సిల్ కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో భాగంగా మానవ హక్కుల పరిరక్షణలో పౌరుడి పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్న వారిని ఆహ్వానించి వారి సూచనలు, సలహాలు స్వీకరిస్తామన్నారు. సర్వసభ్య సమావేశానికి హైకోర్టు న్యాయమూర్తులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటుతోపాటు రాష్ట్ర గవర్నర్‌గా నియమితుడైన జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు మానవ హక్కుల పటిష్టతకు చేపట్టాల్సిన చర్యపై నివేదిక అందజేయనున్నట్టు పేర్కొన్నారు. జూలై నాటికి 25 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా జాతీయ మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్‌లు, సభ్యులను ఆహ్వానించనున్నట్లు చెప్పారు. హక్కుల ఉల్లంఘనతో బాధితులైన వారి హక్కుల పరిరక్షణకు 25 ఏళ్లుగా కౌన్సిల్ పోరాడుతోందన్నారు. బాలలు, మహిళల హక్కులు, పర్యావరణ హక్కులపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. రాజకీయాలకతీతంగా హక్కుల పరిరక్షణకు శ్రమిస్తున్న వారిని మాత్రమే తమ సంస్థ ప్రోత్సహిస్తుందన్నారు. సమావేశంలో వీఎస్ఎస్ మూర్తి, ఎస్‌వీ రమణ, అబ్దుల్ సత్తార్, రావాడ నాయుడు, మాధవి గణపతి, నక్కాన అప్పారావు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

పెదగంట్యాడ: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) పథకంలో భాగంగా జిల్లాలోని 15 ఏళ్ల నుంచి 45 ఏళ్ల నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామని ప్రభుత్వ ఐటీఐ స్టీల్ సిటీ ప్రిన్సిపాల్ లండా సుధాకరరావు బుధవారం తెలిపారు. ఫిట్టర్, ఫ్యాబ్రికేషన్, టిగ్ వెల్డింగ్, అసిస్టెంట్ ఎలక్ట్రిషియన్, సీఎన్‌సీ టర్నింగ్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ప్లంబర్ జనరల్ అండ్ లైట్ మోటర్ వెహికల్ డ్రై వింగ్ (ఎల్ఎంవీ) తదితర కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామని వివరించారు. ఈ శిక్షణకు పదో తరగతి పాస్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. డ్రైవింగ్ శిక్షణకు 18 ఏళ్లు నిండి ఉండాలని, ఐదో తరగతి నుంచి పదో తరగతి పాసైన, ఫెయిలైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం తమ కార్యాలయంలో ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్ జెరాక్స్, ఫోన్ నెంబర్, ఈ-మెయిల్ ఐడీతో తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.